క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ గెలుపు ఖాయం


పోల్నాటి బాబ్జి, జెడ్పీటీసీ

జంగారెడ్డిగూడెం రూరల్‌: రానున్నది వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి సంక్షేమ ప్రభుత్వం అని, పోలింగ్‌ సరళిని బట్టి ఓటర్లు వైఎస్సార్‌ సీపీకే మద్దతు నిలిచినట్లు తెలుస్తుందని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఓటర్లు ఉదయం నుంచి రాత్రి వరకు పోలింగ్‌ కేంద్రాలను వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. గత ఐదేళ్లలో సంక్షేమం, అభివృద్ధి అందించిన వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని బాబ్జి అన్నారు.

అన్నప్రసాద వితరణ


బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: శ్రీ వల్లీ దేవసేన సమేత సుందర బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం అన్నప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందువల్ల భక్తులకు మజ్జిగను కూడా అందించారు. స్వామివారికి బూరి, పులిహోర, రెండు రకాల కూరలు, ఒక చట్నీ, సాంబారు, పెరుగు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం అందించారు. సుమారు 1300 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు కమిటీ అధ్యక్షుడు కానూరి గంగాధరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి దాతలుగా గుబ్బల అరుణ్‌ కుమార్‌, గెడ్డం బ్రహ్మజీ, వారి స్నేహితులు వ్యవహరించినట్లు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడి దుర్మార్గం


నడిపల్లిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ, దళిత నేత గొట్టేటి స్టాలిన్‌, ఇతర నాయకులు

పెదవేగి : వైఎస్సార్‌సీపీ కార్యకర్త చలపాటి రవి బాబుపై టీడీపీ గుండాలు అతి కిరాతకంగా దాడి చేయడాన్ని వైఎస్సార్‌సీపీ పెదవేగి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎస్సీ సెల్‌ నాయకుడు గొట్టేటి స్టాలిన్‌ తీవ్రంగా ఖండించారు. పెదవేగి మండలం నడిపల్లిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై జరిగిన దాడి ఘటనపై దళిత నాయకులు సమావేశం ఏర్పాటు చేసి ఖండించారు. కొప్పులవారి గూడెంలో పోలింగ్‌ సమ యంలో వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌ కుమారుడైన చలపాటి రవిపై దారుణంగా దాడిచేసి కత్తెరతో గాయపర్చిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా స్టాలిన్‌ మాట్లాడుతూ గెలవలేమన్న ఉక్రోషంతో టీడీపీ శ్రేణులు ఇలాంటి దాడులకు పాల్పడటం దుర్మార్గమని అన్నారు. లక్ష్మీపురంలో దళిత కుటుంబానికి చెందిన వ్యక్తిపై సాక్షాత్తు చింతమనేని దాడి చేయడం హేయ మైన చర్య అన్నారు. వైఎస్సార్‌సీపీ నడిపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉక్కుర్తి నాగేశ్వరావు కొప్పుల వారి గూడెంలో జరిగిన దాడిని ఖండించారు. మద్దాల గోపాలరావు వెంట్రపాటి మహేష్‌, చల్లారి పోతు రాజు, సుబ్బారావు, మద్దాల లక్ష్మీనారాయణ, మట్టా నారాయణ రావు, గొడ్డాటి తాతారావు, విజయరాజు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన నిలయాలు


లైబ్రరీలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

భీమడోలు: గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన నిలయాలని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు పాల్గొని తమకు నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసుకుని వాటిని చదివి సామూహిక పుస్తక పఠనం చేసారు. వేసవి సెలవులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బ్యాలెట్‌ బాక్సులు భద్రం

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో 86 శాతం ఓటింగ్‌ నమోదైందని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి, జాయింట్‌ కలెక్టర్‌ బీ లావణ్య వేణి అన్నారు. దెందులూరు ఆర్వో కార్యాలయంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో పోలింగ్‌ సంతృప్తికరంగా జరిగిందని, పోలింగ్‌ శాతం పెరిగిందన్నారు. నియోజకవర్గంలో బ్యాలెట్‌ బాక్సులను సీఆర్‌ఆర్‌ కళాశాలలోని స్ట్రాంగ్‌ రూమ్‌లో భద్రపరిచి ఎన్నికల కమిషన్‌కు నిబంధనలకు అనుగుణంగా పోలీస్‌ భద్రత, సీసీ కెమెరా ఏర్పాటు చేశామన్నారు.

పోలవరంలో పెరిగిన పోలింగ్‌ శాతం


బుట్టాయగూడెంలో ఓటు వేసేందుకు మహిళలు క్యూలో ఉన్న దృశ్యం (ఫైల్‌)


కొయ్యలగూడెంలో ఓటు హక్కు వినియోగించుకున్నామని చూపుతున్న మహిళలు (ఫైల్‌)

- పోలవరం నియోజకవర్గంలో 85.98 శాతం పోలింగ్‌ నమోదు
- విజయంలో కీలకం కానున్న మహిళల తీర్పు

బుట్టాయగూడెం: పోలవరం నియోజకవర్గంలో పోలింగ్‌ శాతం పెరిగింది. సోమవారం జరిగిన పోలింగ్‌లో సాయంత్రం 6 గంటలకు పోలింగ్‌ సమయం ముగిసేనాటికి 75.37 శాతం మాత్రమే పోలింగ్‌ నమోదైంది. అయితే 6 గంటల తర్వాత ఓటు వేసేందుకు ఓటర్లు ఇంకా క్యూలో ఉండడంతో పలు చోట్ల అర్ధరాత్రి వరకూ కూడా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీనితో నియోజకవర్గంలో పోలింగ్‌ 85.98 శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,53,981 మంది ఓటర్లు ఉండగా వీరిలో 2,18,366 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు చెప్పారు. ఇందులో పురుషులు 1,06,077 మంది, స్త్రీలు 1,12,285 మంది, ఇతరులు నలుగురు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు చెప్పారు. సుమారు 6,208 మంది అత్యధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా పోలింగ్‌ సమయంలో ప్రతీ గ్రామంలోనూ అత్యధికంగా మహిళా ఓటర్లే క్యూలో కనిపించారు. అలాగే వృద్ధులు కూడా అత్యధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం జరిగింది. పెరిగిన ఓటింగ్‌ శాతంతో పోటీలో నిలిచిన పార్టీలు ఎవరికివారు గెలుపు తమదే అంటే తమదేనంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే అభ్యర్థుల జాతకాలు ఈవీఎంలలో దాగి ఉండగా, జూన్‌ 4వ తేదీన పోలవరం సీటు ఎవరిని వరిస్తుందో తేలనుంది.

బెట్టింగ్‌లు కాస్తున్న పందెం రాయుళ్లు

పోలవరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ, జనసేన పార్టీల అభ్యర్థుల గెలుపుపై ముమ్మరంగా బెట్టింగులు కాస్తున్నారు. అలాగే రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుపై కూడా జోరుగా బెట్టింగులు సాగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అమలు చేసిన పథకాల పట్ల ప్రజలకు విశ్వాసం ఉందని ఆ నమ్మకంతోనే ప్రజలు వైఎస్సార్‌ సీపీకి పట్టం కట్టబోతున్నారని ఆ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారు. మరోకపక్క కూటమి అభ్యర్థులు తమ మేనిఫెస్టో పట్ల ఓటర్లు ఆకర్షితులయ్యారని తమదే గెలుపంటూ చెబుతున్నారు. అయితే అత్యధికంగా వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని ఇక్కడ పందేలు జరుగుతున్నట్లు సమాచారం.

కొయ్యలగూడెం మండలంలో 85 శాతం పోలింగ్‌ నమోదు

కొయ్యలగూడెం: సార్వత్రిక ఎన్నికల్లో కొయ్యలగూడెం మండలంలో 85.85శాతం పోలింగ్‌ నమోదైంది. 25,833 మంది మహిళలు 25,493 మంది పురుషులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 59843 మంది ఓటర్లకు గాను 51376 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొయ్యలగూడెం టౌన్‌ పరిధిలోని మొత్తం పది పోలింగ్‌ బూత్‌లలో 8312 మంది ఓటుకు వినియోగించుకున్నారు. ఇందులో మహిళలు 4355 పురుషులు 3957 మంది ఉన్నారు.

కుక్కునూరులో 86 శాతం పోలింగ్‌ నమోదు

కుక్కునూరు: కుక్కునూరు మండల వ్యాప్తంగా 86.36 శాతం పోలింగ్‌ నమోదైనట్టు అసిస్టెంట్‌ రిటర్నింగ్‌ ఆఫీసర్‌ కుమార్‌ తెలిపారు. మండలంలో 29,962 మంది ఓటర్లు ఉండగా 26,116 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో పురుషులు 12,692 ఉండగా 13,424 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో ఇబ్రహీంపేట, దామరచర్ల, వెంకటాపురం పోలింగ్‌ బూత్‌లలో సోమవారం రాత్రి 10 గంటల వరకు పోలింగ్‌ జరిగింది. పోలింగ్‌ ముగియడంతో ఆశావాహులు బెట్టింగ్‌లపై దృష్టి సారించారు.

టి.నరసాపురంలో 88.52 శాతం పోలింగ్‌ నమోదు

టి.నరసాపురం: మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 88.52 శాతం పోలింగ్‌ నమోదైంది. మొత్తం 46,094 మంది ఓటర్లు ఉండగా, 40,803 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 20,304 మంది పురుషులు కాగా, 20,499 మంది మహిళలు ఉన్నారు. 15 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన 46 పోలింగ్‌ కేంద్రాల్లో పోలింగ్‌ నిర్వహించారు. మండలంలోని మధ్యాహ్నపువారిగూడెం 71వ నెంబర్‌ పోలింగ్‌ కేంద్రంలో అత్యధికంగా 94.96 శాతం పోలింగ్‌ నమోదు కాగా, కేతవరంలో 85వ పోలింగ్‌ కేంద్రంలో అతి తక్కువగా 77.12 శాతం పోలింగ్‌ నమోదైంది. ఈవీఎంలు మొరాయించడంతో పలుచోట్ల పోలింగ్‌ ఆలస్యంగా ప్రారంభమైంది. పోలింగ్‌ మందకొడిగా సాగడంతో సాయంత్రం 6 గంటలకు పోలింగ్‌ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు పొద్దుపోయే వరకు ఓట్లు వేశారు. మండలంలోని తెడ్లం, కేతవరం, బొర్రంపాలెం, బండివారిగూడెం పోలింగ్‌ కేంద్రాల్లో రాత్రి 11 గంటల వరకు పోలింగ్‌ జరిగింది.

కొయ్యలగూడెంలో గాలివాన బీభత్సం


కొయ్యలగూడెంలోని తాడేపల్లిగూడెం రోడ్డులో ఈదురు గాలులకు నేలకి ఒరిగిన వృక్షం

కొయ్యలగూడెం: గాలివాన బీభత్సానికి కొయ్యలగూడెంలోని పలుచోట్ల వృక్షాలు నేలకు ఒరిగాయి. మంగళవారం సాయంత్రం సుమారు గంట సేపు సంభవించిన గాలివాన గ్రామస్తుల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. తాడేపల్లిగూడెం రోడ్‌లోని వృక్షం మెయిన్‌రోడ్డుపై పడటంతో, రోడ్డుకి ఇరువైపులా ట్రాఫిక్‌ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. రోడ్లపైకి డ్రెయినేజీలోని నీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బయ్యనగూడెం, కన్నాపురం, పొంగుటూరు, అచ్చుతాపురం పరిధిలో తీవ్రంగా ఈదురుగాలులు వీయడంతో చెట్లు కొమ్మలు విరిగిపడ్డాయి.

ఆమె నిర్ణయమే కీలకం

- ఓటింగ్‌లో అధిక శాతం అతివలే
- నియోజకవర్గంలో 81.52 శాతం పోలింగ్‌ నమోదు


కామవరపుకోట మండలం జలపవారిగూడెం గ్రామంలో గురువారం రాత్రి రెండున్నర గంటల వరకు ఓటు వేయడానికి క్యూకట్టిన ఓటర్లు

చింతలపూడి: చింతలపూడి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ ప్రశాంతంగా ముగిసింది. రాత్రి పొద్దుపోయే వరకు పలు పోలింగ్‌ కేంద్రాల్లో ఓటర్లు వేచి ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కామవరపుకోట మండలం అంకాలంపాడు పంచాయతీ జలపవారిగూడెం గ్రామంలో పోలింగ్‌ మరింత ఆలశ్యమైంది. అర్ధరాత్రి 2.30 గంటల వరకు ఓటర్లు క్యూలో వేచి ఉండి ఓట్లు వేశారు. నియోజకవర్గంలో పోలింగ్‌లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా పాల్గొనడం విశేషం. దీంతో అభ్యర్థుల భవితవ్యం నిర్ణయించడంలో ఆమె తీర్పే కీలకం కానుంది. నియోజకవర్గంలో మొత్తం 2,73,069 మంది ఓటర్లు ఉండగా వారిలో 2,22,608 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పోలింగ్‌ 81.52 శాతంగా నమోదైనట్లు రిటర్నింగ్‌ అధికారి కె అద్దయ్య మంగళవారం తెలిపారు. వారిలో పురుషులు 1,34,295 మంది ఓటర్లు ఉండగా 1,10,679 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 82.41 శాతం నమోదైంది. స్త్రీలు 1,38,733 మంది ఓటర్లకు గాను 1,11,908 మంది ఓట్లు వేయగా 80.66 శాతం, ట్రాన్స్‌ జెండర్లు 41 మందికి 21 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అభ్యర్థుల్లో టెన్షన్‌, టెన్షన్‌.. లెక్కల్లో మునిగిన అభ్యర్థులు

అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఇక అభ్యర్థుల్లో టెన్షన్‌ మొదలైంది. విజయం మాదంటే, మాదంటూ ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. దీంతో పార్టీల మధ్య తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఫలితాలపై గ్రామ స్థాయి నాయకుల నుంచి నియోజకవర్గ స్థాయి నేతల వరకు లెక్కల్లో మునిగి తేలుతున్నారు. పోలింగ్‌ స్టేషన్ల వారీగా తమకు వచ్చే ఓట్లను అంచనా వేసుకుంటున్నారు. ఎక్కడ ప్లస్‌, ఎక్కడ మైనస్‌ అంటూ బేరీజు వేసుకుంటున్నారు. ప్రధాన పోటీదారులైన వైఎస్సార్‌ సీపీ, కూటమి గెలుపోటములపై విశ్లేషకులు లెక్కలు వేస్తున్నారు. వచ్చే నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపుతో వీరి భవితవ్యం తేలనుంది. గతంలోలాగానే ఈ ఎన్నికల్లో కూడా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభావం ఎక్కువగా కనిపించింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలో ఫ్యాను గాలి బలంగానే వీచినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీల బలాబలాలు, కుల సమీకరణాలు బేరీజు వేసుకుంటే వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి విజయరాజు విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ నాయకులు లెక్కలతో సహా ఉదహరిస్తున్నారు.

పోలవరంలో విజయం వైఎస్సార్‌ సీపీదే..


దుద్దుకూరులో విలేకర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని రాజ్యలక్ష్మి, ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: పోలవరం నియోజకవర్గంలో ఫ్యాన్‌ జోరు పెరిగినట్లు పోలింగ్‌ సరళిని పరిశీలిస్తే స్పష్టంగా తెలుస్తుందని వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని తెల్లం రాజ్యలక్ష్మి, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని దుద్దుకూరులో వారు విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను కూడా నెరవేర్చారని అన్నారు. దీనితో జగనన్నపై ప్రజలకు నమ్మకం మరింత పెరిగిందని అన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు తెలుస్తుందని అన్నారు. ప్రతి పోలింగ్‌ కేంద్రం వద్ద వృద్ధులు, వికలాంగులు, మహిళలు భారీగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు రావడం చూస్తే వైఎస్సార్‌ సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు, అభిమానులకు, ప్రజలకు ఈ సందర్భంగా బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రచార కార్యక్రమంలో ఎండ, వానా, రాత్రి, పగలు తేడా లేకుండా నిరంతరం కృషి చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు అభ్యర్థిని రాజ్యలక్ష్మి తెలిపారు. ప్రతి కార్యకర్తకు, నాయకుడికి తమ కుటుంబం అండగా ఉంటుందని చెప్పారు.

గోశాల ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌గా వంటిపల్లి


ఏలూరు గోశాల ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌గా ఎంపికైన వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

టి.నరసాపురం: మండలంలోని కె.జగ్గవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, రైల్వే బోర్డు మెంబర్‌ వంటిపల్లి వెంకటేశ్వరరావు మంగళవారం ఏలూరు గోసంరక్షణ సమితి ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోశాల అభివృద్ధికి, గోవుల పరిరక్షణకు కృషిచేస్తానని, తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. ఇప్పటికే వెంకటేశ్వరరావు ద్వారకాతిరుమల వాసవీ కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపం ట్రస్ట్‌ జాయింట్‌ సెక్రటరీగా, కె.జగ్గవరం సహకారం సంఘం పర్సన్‌గా, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర సంఘానికి కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త, గోశాల ప్రధాన కార్యదర్శి మునగాల మురళీకృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్‌ సామగ్రి తరలింపు


భోగాపురం నుంచి ఈవీఎం ఇతర సామగ్రిని వ్యాన్‌లో ఏలూరుకు తరలిస్తున్న సిబ్బంది

భీమడోలు: ఉంగుటూరు నియోజకవర్గంలోని సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సోమవారం రాత్రి వరకు కొనసాగింది. 2019 ఎన్నికల్లో 86.07 శాతం కాగా ప్రస్తుతం 87.75 శాతం నమోదైంది. దీనితో 1.68 శాతం పెరిగింది. పోలింగ్‌ ముగిసిన అనంతరం ఎన్నికల సిబ్బంది తమ ఎన్నికల పోలింగ్‌ మెటీరియల్‌ను బస్సుల్లో, వ్యాన్‌ల్లో అర్ధరాత్రి ఏలూరు సీఆర్‌ రెడ్డి ఇంజనీరింగ్‌ కళాశాలకు తరలించారు. ఈవీఎమ్‌, కంట్రోల్‌ యూనిట్‌, వీవీప్యాడ్‌ మిషన్లను భద్రంగా తమ వెంటే పెట్టుకుని అధికారులు ఏలూరుకు తీసుకుని వెళ్లారు. దీనితో తెల్లవారే వరకు వారంతా పడిగాపులు కాశారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద గల అధికారులకు పోలింగ్‌ సామగ్రిని అందించారు. అనంతరం వారంతా మంగళవారం ఇళ్లకు చేరుకున్నారు.

కాయ్‌ రాజా.. కాయ్‌

- ఎవరికి వారే గెలుపుపై ధీమా
- విజయం, మెజార్టీలపై బెట్టింగ్‌ల జోరు

పెదవేగి : సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ ప్రక్రియ ముగియడంతో ఆయా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. గెలుపు ఖాయమనే నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్‌ అనంతరం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి దెందులూరు నియోజకవర్గ నాలుగు మండలాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం స్పష్టంగా కనిపించిందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌ గెలుపు బీజేపీ, జనసేన మద్దతు ఇవ్వడంతో విజయం మనదేనన్న విషయాన్ని వెల్లడిస్తున్నారు.

బెట్టింగ్‌ల జోరు

నియోజకవర్గంలో ఎక్కడ చూసినా... ఏ గ్రామం వెళ్లినా ఎవరు గెలుస్తారనే విషయంపై చర్చలు జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ గెలవడం ఖాయ మనే ధోరణి వ్యక్తమవుతుండగా ఎంత మెజార్టీ వస్తుందనే దానిపైన కూడా ఆలోచన చేస్తున్నారు. జనసేన, బీజేపీ, టీడీపీ కలిపి పోటీ చేయడంపై వాదోపవాదాలు చర్చలు జరుపుకుంటూ బెట్టింగ్‌లపై ఆసక్తి చూపుతున్నారు. గెలుపుపై అనుమానం వచ్చిన వారు తమకు తెలిసిన వారికి, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులతో చర్చలు జరిపి పార్టీ స్థితిగతులను తెలుసుకుని మరీ ఈ బెట్టింగ్‌లకు దిగుతుండటం గమనార్హం. ప్రధాన పార్టీల స్థానాలతోపాటు మెజార్టీలపై కూడా జోరుగా బెట్టింగులు వేసుకోవడం విశేషం. నియోజకవర్గంలో సంక్షేమాభివృద్ధి చేసిన రాజకీయ విధానానికి పట్టం కట్టి మరో మారు స్వర్ణయుగ పాలనకు శ్రీకారం చుట్టేలా ఒక్క అవకాశం విద్యావంతులకు, యువకులకు అప్పగించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా ఇప్పటికే ఓటు ద్వారా మా నిర్ణయాన్ని తెలియజేశామని ప్రజలు చెబుతున్నారు. నియంత పాలనకు వ్యతిరేకంగా అబ్బయ్యచౌదరి విజయం సాధిస్తారనే స్వరం ఎక్కువగా వినబడుతోంది. జూన్‌ 4వ తేదీ కోసం ప్రజలు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఏ అభ్యర్థిని విజయం వరిస్తోందనని బెట్టింగ్‌లకు సిద్ధమవుతున్నారు.

నేటినుంచి గ్రామాల్లో మలాథియాన్‌ స్ప్రేయింగ్‌

పోలవరం రూరల్‌: ఈ నెల 15వ తేదీ నుంచి పోలవరం మండలంలోని గ్రామాల్లో మలాథియాన్‌ స్ప్రేయింగ్‌ నిర్వహిస్తున్నట్లు పోలవరం మలేరియా సబ్‌యూనిట్‌ అధికారి బి.నాగేశ్వరరావు తెలిపారు. పోలవరం మండలంలోని ఎల్‌ఎన్‌డీపేట పీహెచ్‌సీ పరిధిలో 37 గ్రామాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. తొలి విడత మలాథియాన్‌ స్ప్రేయింగ్‌ను బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున ఆయా గ్రామాల్లోని ప్రజలు వారి ఇంటి బయట, ఇంటి లోపల మందును స్ప్రేయింగ్‌ చేయించుకోవాలని కోరారు.

ఏజెన్సీలో చల్లబడ్డ వాతావరణం

బుట్టాయగూడెం: గత కొద్దిరోజులుగా విపరీతమైన ఎండలతోపాటు అప్పుడప్పుడు వర్షాలు కురిసినా తీవ్రమైన ఉక్కపోతలతో అల్లాడిపోతున్న ప్రజలకు మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం లభించింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో ప్రజలు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితుల్లో సాయంత్రం కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. దీనికి తోడు మరో మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రుతుపవనాలు కూడా ముందుగానే రానున్నట్లు ప్రకటించడంతో రైతులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గోపాలపురంలో 86.67 శాతం పోలింగ్‌ నమోదు


గుణ్ణంపల్లిలో ఓట్లు వేసేందుకు క్యూ కట్టిన ఓటర్లు (ఫైల్‌)

ద్వారకాతిరుమల: గోపాలపురం నియోజకవర్గంలో సోమవారం అత్యధికంగా పోలింగ్‌ నమోదైంది. ఉదయం 7 గంటల నుంచి నిరంతరాయంగా ఓటర్లు పోలింగ్‌ కేంద్రాల వద్ద వేచి ఉండి మరీ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలు కేంద్రాల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్‌ జరిగింది. నియోకవర్గంలోని ద్వారకాతిరుమల, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం ఈ నాలుగు మండలాల్లో మొత్తం 2,42,763 మంది ఓటర్లకు గాను 2,10,391 మంది ఓట్లు వేశారు. అందులో పురుష ఓటర్లు 1,04,831 మంది, మహిళా ఓటర్లు 1,05,556 మంది, థర్డ్‌ జెండర్‌ 4 గురు ఉన్నారు.

ప్రజల ఆదాయం పెంచిన ఎన్నికలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సార్వత్రిక ఎన్నికలు నగరంలో ప్రజల ఆదాయాన్ని పెంచాయి. ఎన్నికల పేరు చెప్పుకుని అనేక వర్గాలకు ఆదాయం ఊహించిన దానికంటే ఎక్కువగా వచ్చింది. ఎన్నికల్లో అభ్యర్థులు వినియోగించే జెండాలు, బ్యాడ్జిలు, ఫెక్సీలు, టోపీలు, కండువాలు ఇలా ఆయా వస్తువుల తయారీతో కొందరు, ప్రచారానికి అభ్యర్థుల ఘనతను చాటుతూ గీతాలు రాయడంతో పాటు వాటిని పాటలుగా మలిచి రికార్డింగ్‌ చేసి మరికొందరు ఉపాధి పొందారు. ప్రచారానికి వినియోగించిన ఆటోలు, ఇతర వాహనాల వారు సైతం తాము సాధారణ రోజుల్లో పొందే ఆదాయానికి రెండితల ఆదాయం పొందారు. వివిధ డివిజన్లలో అభ్యర్థుల శిబిరాల్లో ఉండే యువతకు నిత్యం భోజనాలు, అల్పాహారాలు అందించే కాంట్రాక్టులు పొంది కొందరు ఆదాయం గడించారు. వివిధ పార్టీల అభ్యర్థులకు ఓటర్లకు డబ్బులు పంచడంతో స్థానికులకూ చేతిలో డబ్బులు ఆడాయి. దీంతో నగరంలోని పలు వ్యాపారాలు ఊపందుకున్నాయి. ఎన్నికలు ప్రారంభమైన నాటి నుంచి బిర్యానీ పాయింట్లు, ఫ్యాన్సీ దుకాణాలు, వస్త్ర దుకాణాలు కళకళలాడగా, ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసిన నాటి నుంచి ఆయా దుకాణాలకు ప్రజలు తండోపతండాలుగా తరలివెళ్లారు.